
# దాచేస్తే దాగని సత్యం

ఇంద్రగంటి జానకీ బాల

**నవమన్మథుడిలాంటి ఇరవై ఆరేళ్ళ ప్రవీణ్ ఆఫీసరు హోదాలో ఆ ఆఫీసులో, అడుగు పెట్టినప్పుడు అందరూ ఆశ్చర్యంతో దాదాపు నోళ్ళు తెరిచి చూశారు.**



అందం, దర్పం, చదువు, హోదా అన్నీవున్న ఆ కుర్ర ఆఫీసర్ని చూసి ఆశ్చర్య పోవడమెందుకూ అనేది ప్రశ్నే. ఎందుకంటే అలాంటి చాకుల్లాంటి కుర్రాళ్ళు ఆఫీసర్ల హోదాలో వచ్చి బాకుల్లా వ్యవహరించడం అనుభవమే. కానీ ఈ ప్రవీణ్‌ని చూశాక, ఎవరో మరీ కొత్తగా ఉద్యోగంలో చేరిన స్టాఫ్ తప్ప, పాత వారంతా ఆశ్చర్యం నుండి తిప్పుకో లేక పోయారన్న మాట నిజం.

అలా ఆశ్చర్యంలో మునిగిపోయి, తేరుకోలేక పోయిన వారిలో మొదటివాడు ఖుదీరాం. మరో ఏడాదిలో రిటైరు కాబోతున్న ఖుదీరాం బుర్రంతా ఒక్కసారి గందరగోళమై పోయింది.

ప్రవీణ్ ఎవరో కాదు. ఏడాది క్రితం అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించిన ఆఫీసరు స్వామినాథన్ కొడుకు. స్వామినాథన్ పోయిన సమయానికి ప్రవీణ్ అన్ని అర్హతలతో ఆడిట్ ఆఫీసరుగా రావడానికి సిద్ధంగా వున్నాడు. అంతే–, అతనికి అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్టు, ఉద్యోగం వచ్చి వాకిట్లో వాలింది.

అయితే అతను వుద్యోగంలో చేరిన వారం రోజుల్లో అతని పరోక్షంలో సాగే గుసగుసలు, యికయికలు, రహస్య వ్యాఖ్యలూ, క్రమంగా అతనికి చేరనే చేరాయి.

అందరికంటే ఎక్కువ కలత పడినవాడు ఖుదీరాం. కాలం వెనక్కి మళ్ళిపోయి ప్రయాణిస్తున్నట్టు భావించుకుని తికమక పడిపోయాడు ఖుదీరాం–

అనుకున్నంతా అయింది. ఆ రోజు ఖుదీరాంని పిలిచి "ఏమిటీ గోల"? అన్నాడు ఆఫీసరు ప్రవీణ్ విసుగ్గా. ఖుదీరాం తలొంచుకున్నాడు.

ప్రవీణ్ అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పాలంటే చాలా పెద్ద కథ చెప్పాలి. ఒక్కొక్కసారి కథ జీవితంలా వున్నా వుండక పోయినా, జీవితం కథలా వుండే అవకాశం వుంటుంది.

ఖుదీరాం మౌనాన్ని ప్రవీణ్ ఎక్కువ సేపు సహించ లేక పోయాడు.

"ఎవడా కుర్రవాడు? నన్నూ, వాడ్నీ మార్చిమార్చి చూసి అందరూ ఎందుకలా ఆశ్చర్య పోతున్నారు" అన్నాడు.

ఖుదీరాం ఆలోచనలో పడ్డాడు. ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి? అద్దంలో తన ప్రతిబింబం చూసినట్లయి, కంగారు పడుతున్న ఈ కుర్రాడు తను చెప్పేది విని ఎలా రియాక్టవుతాడు? రవి మీద కసి పెంచుకుంటాడా? వాడ్ని ఉద్యోగంలోంచి వూడపీకిస్తాడా? వాడికి మరే రకమైన హాని కలిగించినా, అది న్యాయమా?

ఖుదీరాం పెద్దవాడు. మంచివాడు సముద్రం లాంటి జీవితాన్ని మథించిన వాడు.– అందుకే ప్రవీణ్ ఖుదీరాం దగ్గరగా వెళ్ళి సూటిగా అతని కళ్ళల్లోకి చూస్తూ నెమ్మదిగా– "ఖుదీరాం గారూ! నేను మీ కంటే చాలా చిన్నవాడ్ని. అనేక కారణాలవల్ల ఆఫీసులో మీకంటే పెద్ద పొజిషన్‌లో వుంటే వుండవచ్చు. మీరు నాకు తండ్రిలాంటి వారు. నేను రకరకాల మాటలు, గాలి వాటుగా వింటుంటే మతి పోతోంది. మీరు నాకు నిజం చెప్పండి"–

"అదీ... అదీ... నీకు చెప్పేది కాదు– చెప్పేందుకేమీ లేదు– అదే... మీరు"–

"ఫర్వాలేదు నన్ను 'నువ్వు' అనండి, నాకు నిజం చెప్పండి. అదెంత కఠినమైన దైనా సరే– చెప్పండి, దయచేసి నన్ను మభ్య పెట్టాలని ప్రయత్నించకండి"

ఖుదీరాం ఒక్కసారి గజగజలాడి పోయాడు. ప్రవీణ్‌లోని నిజాయితీ, తీక్షణత – ముక్కుకి సూటిగా పోయే అతని తత్వం కదిలించింది. దాచేస్తే దాగని సత్యాలుంటాయి కొన్ని. మనుష్యుల్ని, మోసగించవచ్చుకానీ ప్రకృతిని ఎవ్వరూ మోసగించలేరు–,

* * * * * * * * *

మరిడయ్య సోనాని వెంటబెట్టుకొని వచ్చి ఖుదీరాంకి దణ్ణం పెట్టాడు... సీరియస్‌గా ఏవో కాగితాలు చూసుకుంటున్న ఖుదీరాం తలెత్తి మరిడయ్యని చూసి, మళ్ళీ తన పనిలో పడ్డాడు, కానీ మరిడయ్య పక్కనే నిలబడి వున్న సోనాని చూసీ చూడనట్టు చూశాడు. మెరుపు దెబ్బ తగిలినట్లయింది.

"ఏం మరిడయ్యా నిలబడ్డావ్" అన్నాడు రాస్తున్న నోట్ ఫైల్ పక్కన పెట్టి.

అప్పుడు మరిడయ్య నెమ్మదిగా సోనాని ముందుకు రమ్మని సైగచేసి, "అయ్యా! ఇది నా సెల్లి కూతురు. తల్లీతండ్రీ లేరు. మనాఫీసులో సమ్మర్‌లో వాటర్ కూలీపని దీనికిప్పించమని అడుగుదామనీ..." అన్నాడు.

ఖుదీరాం ఒక్కసారి సోనాకేసి చూసి మరింత బిత్తర పోయాడు. ఆమె పనిచేసుకుని బతికే మురికి మనిషిలా లేదు. పరదాల వెనుక వుండే మహారాణిలా వుంది. తెల్లని పాలరాతి బొమ్మలా, తీర్చిదిద్దినట్లున్న కనుముక్కు తీరు–, నల్లగా విశాలంగా

మెరిసే కళ్ళు– గవర్నమెంటు ఆఫీసులో క్యాజువల్ వాటర్ కూలీగా ఏ మాత్రం సూట్‌కాదు. ఏ రాజ్‌కపూరైనా ఈమెని చూస్తే, ఈమెకోసం కథ రాయించి, కొత్త సినిమా తీస్తాదు ఈమె హీరోయిన్‌గా–, అనుకున్నాడు ఖుదీరాం.

అయితే అతని మౌనాన్ని మరిడయ్య మరోలా అనుకున్నాడు. అందుకే వెంటనే అందుకున్నాడు.

"అయ్యగారితో నే సెప్తాలెండి. ఆరు సరేనంటారు మీ సెవిలో కూడా ఓ మాట ఏద్దావనీ..." అన్నాడు.

"బాగానే వుంది. అలాగే చేద్దాంలే, మనకేలాగూ మనిషి కావాలి. పాపం, అవసరంలో వుందన్నావుగా" అన్నాదు ఖుదీరాం.

ఆ తర్వాత సోనాని తీసుకుని ఆఫీసరు స్వామి నాథన్ దగ్గరకి వెళ్ళాడు మరిడయ్య.

* * * * * * * *

వారం రోజుల తర్వాత మరిడయ్య చెప్పిన మాటలు విని నిశ్చేష్టుడై పోయాడు ఖుదీరాం. మరిడయ్య ముఖం చిన్నబోయి, వాడి పోయి వుంది. ఎటూ ఏమీ చెప్పలేనట్టుగా, సంఘర్షణతో సతమతమై పోతున్నట్టుగా వుంది.

"అయ్యగారి కిలాంటి బుద్ధిపుడుతుందని నేనెప్పుడూ అనుకోలేదు" అన్నాడు నీరసంగా.

"గట్టిగా చెప్పక పోయావా?"

"ఏం చెప్పమంటారయ్యా?"

"ఆ పిల్ల నీ బంధువనీ, నీ చెల్లి కూతురనీ–"

"అబ్బో! ఆయనివన్నీ ముందుగానే తెలుసుకున్నారయ్యా;"

"ఏమని?"

"నిజవే కదండీ, సోనా, నా బంధువేం కాదండి. నా చెల్లి కూతురు కాదు– అనాథపిల్ల– అదే ఆయన వాదం"


"అయితే మాత్రం–ఎవరూ లేరని ఆ పిల్లని అన్యాయం చేస్తామా" అందామనుకుని లోపల్లోపలే గింజుకుని వూరుకున్నాడు.

నిజానికి స్వామినాథన్ దేం తప్పలేదని పించింది. తప్పంతా ఆ పిల్లకున్న అందానిదీ– , ఆ అందాన్ని రక్షించుకోలేని పేదరికానిదీనూ– అనుకున్నాడు ఖుదీరాం.

స్వామినాథన్ చాలా చక్కనివాడు. డబ్బు హోదా వున్నవాడు. సాధారణ విషయాలలో మంచివాడు కూడా– అయితే అతనికున్న పరస్త్రీ వ్యామోహం కాస్త ఎక్కువేనని చెప్పాలి. పరస్త్రీని ఆశించేవాడికి అతని భార్య అందంగా వుంటుందా వుండదా అనేది అనవసరం... ఒక వేళ అతని భార్య అపురూప సౌందర్యవతైనా సరే అతని బుద్ధి అతనిదే. కానీ స్వామినాథన్ భార్య మాత్రం అందగత్తె కాదు. వెడల్పయిన ముఖం, చింతాకుల్లాంటి కళ్ళు, బండగా వున్న పెదవులు– ఆమె అందానికి ఆమడ దూరం. కానీ లక్షల రూపాయలు తీసుకొచ్చిన కులమింటి కోతి.– అది తిరస్కరించి సౌందర్యంకోసం వేటాడి అందమైన అమ్మాయిని చేసుకోవాలనే తీవ్ర వాంఛేమీ స్వామినాథన్‌కి లేదు.

భార్యని భార్యగా వుంచి బయట వ్యవహారాలు గుట్టూ చప్పుడూ కాకుండా నడిపించగల తెలివుందతనికి.

అలాంటి స్వామినాథన్ సోనా కావాలని అడగడంలో ఆశ్చర్యమేమీ లేదుగానీ, మరిడయ్య మాత్రం అది వూహించక పోవడంతో ఏం చెయ్యాలో తోచక కంగారు పడ్డాదు. ఇలాంటి వ్యవహారాలు మరిడయ్యకి యిష్టముండదు. ఏదో అనాథ పిల్లకి వుపకారం చేద్దామనుకున్నాడు. – స్వామినాథన్ దృష్టి పడ్డాక తప్పించడం కష్టం. పైగా తనకున్న స్వామి అండకూడా పోతుందని అతను భయపడ్డాడు. ఏమైనా, శాశ్వితమైన ఉద్యోగం దొరికితే బతుకు ఆమెకి నిశ్చింతగా వెళ్ళి పోతుందని బాగా ఆలోచించి మెత్తబడ్డాడు. ఫలితంగా సోనా స్వామినాథన్ సొత్తయింది. ఏమీ తెలీని ఆమె ముందు బిత్తర పోయి ఏడ్చింది. కానీ స్వామినాథన్ ఆమెని ఓదార్చి, ఎన్నో కబుర్లు చెప్పి, మభ్యపెట్టి లొంగ దీసుకున్నాడు. సోనా అందానికి అతడు దాసుడైపోయాడు.–



ఖుదీరాం, మరిడయ్య యిద్దరూ ఎప్పుడూ స్వామి నాథన్ కార్యకలాపాలను కాపలా కాస్తూనే వున్నారు.

అయినా అనుకున్న దానికంటే ముందుగానే విషయం గుప్పుమంది. నిప్పు అంటుకోవడమే యింట్లో అంటుకుంది. అది బాగా రాజుకుని అతని మామ గారి దృష్టికి చేరుకుంది.

అంతే–, నెల్లాళ్ళలో స్వామినాథన్‌కి అయిదు వందల మైళ్ళ దూరంలోవున్న వూరికి బదిలీ అయింది.

హడావిడిగా ప్రయాణమై వెళ్ళిపోతున్న స్వామినాథన్‌ని నిలేశాడు ఖుదీరాం.

"ఆ పిల్లని సర్వ నాశనం చేశావు. దానికి కనీసం ఉద్యోగమూ వేయించలేదు. ఉద్యోగం యిప్పిస్తానని మభ్యపెట్టావు. మరిడయ్య నలుగురిలో తలెత్తుకోలేక సిగ్గుతో కుంచించుకు పోతున్నాడు" అన్నాడు.

స్వామినాథన్ నీరసంగా తలెత్తి ఖుదీరాం వంక చూచి దీనంగా" నువ్వుకూడా అలాగంటే ఏం చెప్ప గలను?

నేను సోనాని వదలాలనుకోలేదు. ఉద్యోగం కూడా యిద్దామనే అనుకున్నాను. కానీ పరిస్థితులు చాలా దారుణంగా మారిపోయాయి" అన్నాడు.

"దారుణంగానే వుంటాయి యిలాంటి విషయంలో పరిస్థితులు– కానీ ముందు తెలీదా యిలా జరుగుతుందని?"–

స్వామినాథన్ తలొంచుకుని నిలబడిపోయాడు. కొంతసేపు అలాగే వుండి సడన్‌గా ఖుదీరాం చేతులు రెండూ పట్టుకుని

"ఖుదీరాం. ఇవి చేతులు కావు. కాళ్ళు, నే వెళ్ళి పోయినా వచ్చే ఆఫీసర్‌తో చెప్పి ఏలాగైనా పోస్టు

వేయించు. సోనాకి ఏలాగైనా వుద్యోగం వేయించు. నీ మేలు మర్చిపోను. నీ రుణం వుంచుకోను" అన్నాడు.

ఆ మర్నాడు మరిడయ్య కళ్ళ నీళ్ళెట్టుకుని చెప్పాడు"సోనా యిప్పుడు వట్టి మనిషి కూడా కాదు. నీళ్ళోసుకుంది."–, అని–

ఖుదీరాం గుండెలు మండి పోయాయి. అనాథ అంటే ఈ లోకానికెంత లోకువ. ఆమెకి 'నా' అనే వారెవరూ లేరని ఆమె కెంత అన్యాయం చేయడానికీ వెనుకాడని ఈ మనుష్యుల్ని ఏమనాలి?–

స్వామి నాథన్ చేసిన అన్యాయంలో తనూ పరోక్షంగా భాగం పంచుకున్నట్టు ఫీలయ్యాడు ఖుదీరాం. పశ్చాత్తాపం అతణ్ని దహించి వేయసాగింది.

ఖుదీరాం కొత్తగా వచ్చిన ముసలి ఆఫీసరుతో జాగ్రత్తగా చెప్పి సోనాకి స్వీపరు వుద్యోగం వేయించేసరికి ఆమె పిల్లాణ్ని కని రెండు నెలలైంది.

* * * * * * * * *

ఏళ్ళు గడుస్తున్న కొద్దీ సోనా వెంట వెంటే తిరిగే కుర్రాడు స్వామినాథన్ నోట్లోంచి వూడిపడి నట్లుండడం చూసి అందరూ ఆశ్చర్యపోసాగారు. అయితే రహస్యం దాస్తే దాగేది కాదని చాటి చెప్తూ వాడు స్వామినాథన్ ప్రతి రూపంగా పెరుగుతూ వచ్చాడు. సోనా కొడిక్కి 'రవి' అని పేరు పెట్టి, వున్నంతలో శుభ్రంగా పెంచింది. రవి దొరబాబులా పెరిగాడు పదో క్లాసు ప్యాసయ్యాడు.

తలతాకట్టు పెట్టయినా కొడుకుని పెద్ద చదువులు చదివించాలనుకుంది సోనా. కాని విధి ఆమెని వెక్కిరించింది. అంతు తెలియని రోగంతో మంచం పట్టి ఆరు నెలల్లో కన్ను మూసింది. సోనా చనిపోయాక తెలిసింది, ఆమె క్యాన్సర్‌తో మరణించిందని–

వయస్సువల్ల ఒంట్లో ఓపిక లేక ప్రమోషన్లు వదులుకుని అక్కడే వుండిపోయిన ఖుదీరాం అన్నిటికీ ప్రత్యక్ష సాక్షుడై పోయాడు. రవికి తల్లి చచ్చిపోయిందని డిసీజ్డ్ కోటాలో స్వీపరు ఉద్యోగం యిప్పించాడు. అక్కడే స్వీపరుగా పని చేస్తున్న రవి, ఆఫీసరుగా అక్కడికొచ్చిన ప్రవీణ్ ఒకే పోలికలతో వుండడం చూసి అందరూ ఆశ్చర్య పోయారు.

* * * * * * * * * *

ఖుదీరాం చెప్పిన విషయాలు విన్న ప్రవీణ్ స్థాణువులా వుండిపోయాడు. అతని ముఖం నల్లగా మాడిపోయింది. అతను కొంతసేపు ఏమీ మాట్లాడలేక పోయాడు. అతన్నా స్థితిలో చూసిన ఖుదీరాం మనసు విలవిల్లాడి పోయింది. కానీ అతనేం చెయ్యలేని స్థితిలో వున్నాడు. నిజాన్ని దాచాలనే ప్రయత్నం చేశాడు. కానీ కుదరలేదు. కానీ ప్రవీణ్ లాంటి యువకుడు తను చెప్పిన సంగతులు వినడం, అర్థం చేసుకోవడం కష్టం అని అనిపించిందతనికి. అతనే నెమ్మదిగా మనసుని సమాధాన పరచుకుంటాడని ఖుదీరాం అక్కణ్నించి వెళ్ళిపోయాడు.

* * * * * * * * * *

ఆ రోజు ప్రవీణ్ చెప్పిన మాటలు విని తెల్లబోయాడు ఖుదీరాం. అతనేం మాట్లాడుతున్నాడో ఒక్క క్షణం అర్థంకాక తికమక పడ్డాడు. అవాక్కయి తనవైపే చూస్తున్న ఖుదీరాంకి దగ్గరగా వెళ్ళి "నిజం ఖుదీరాంగారూ! మా నాన్నగారికి వారసుణ్ని నేను. ఆయన వంశానికీ, ఆయన ఆస్తిపాస్తులకీ, కుటుంబ ప్రతిష్టకీ, ఆయన బాధ్యతలకీ వారసుణ్ని నేను, చివరికి ఆయన ఉద్యోగంకూడా నాకు వారసత్వంగా సంక్రమించింది. ఆయన బలహీనతకి సంబంధించిన ఒక్క బాధ్యతను నేను స్వీకరించకపోతే ఎలా? అది అన్యాయం కాదూ? అది నా విధి నిర్వహణలో లోపం కాదూ"–

ఖుదీరాం ఏదో చెప్పబోయి గొంతు సవరించుకున్నాడు."నువ్వు చాలా పెద్ద మనసుతో అన్నావుగానీ, దీని మీద మీ అమ్మగారేమనుకుంటారో ఆలోచించావా"–

"ఏమీ అనుకోరు. నాకా నమ్మకం వుంది. నా నిర్ణయానికి ఆమె తప్పక సంతోషిస్తుంది. కాబట్టి–, మీరు రవిని వెంటనే రెసిడెన్షియల్ కాలేజిలో చేర్పించేందుకు ఏరాటు చేయండి అతణ్ని బాగా చదివించి, మంచి హోదాలో నిలబెట్టాల్సిన బాధ్యత నాది. నేనుండగా నా తమ్ముడు అనాథకాడు. ఇది నాన్నగారి నుంచి అజ్ఞాతంగా వచ్చిన వారసత్వం నాకు. ఆనందంగా స్వీకరిస్తాను" అన్నాడు దృఢంగా.

హస్తిమశకాంతరం వున్న ఆ తండ్రీ కొడుకుల్ని కళ్ళారా చూసిన ఖుదీరాం అన్యాయం మీద ఆదర్శం గెలుపుని కూడా కళ్ళారా చూసి ముందుకి కదిలాడు.●